సాక్షి
కామారెడ్డి
శనివారం ၊ 6 ၊ జూలై ၊ 2024



ఉద్యోగాలను భర్తీ చేయాలి

జాబ్ క్యాలెండర్ ప్రకటించి, ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడించారు.

- 8లో ▸



ఆర్ఆర్ఆర్ జాడెక్కడ?

బాన్సువాడ పట్టణంలో ఏర్పాటు చేసిన 'రెడ్యూస్.. రీయూజ్.. రీసైకిల్' కేంద్రాలు ప్రారంభించిన మూణ్నాళ్లకే మూతపడ్డాయి.

- 9లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
38.5 /23.4

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

'సత్వర న్యాయం అందించాలి'



కామారెడ్డి క్రైం: పోలీస్ స్టేషన్‌లకు వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందించాలని ఎస్పీ సింధు శర్మ ఆదేశించారు. శుక్రవారం ఆమె దేవునిపల్లి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి కేసుల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు చేరువయ్యేలా విధులు నిర్వహించాలన్నారు. ప్రజా సమస్యలపై వెంటనే స్పందించాలన్నారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్ సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలన్నారు. డయల్ 100 కు వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలన్నారు. పోలీసు అధికారులు తమకు కేటాయించిన గ్రామాల్లో క్రమం తప్పకుండా పర్యటించాలన్నారు. ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ నాగేశ్వర్‌రావు, రూరల్ సీఐ రామన్, దేవునిపల్లి ఎస్సై రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

8న ఎక్సైజ్ ఆఫీస్‌లో బైక్ వేలం

బాన్సువాడ: బాన్సువాడ ఎక్సైజ్ కార్యాలయం వద్ద ఈనెల 8న బైక్‌ను వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ యాదగిరి రెడ్డి తెలిపారు. ఓ కేసులో స్వాధీనం చేసుకున్న హీరోహోండా గ్లామర్ (ఏపీ 09 బిజీ 6852) బైక్‌ను వేలం వేయనున్నామని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు పాల్గొనాలని కోరారు.

పైసల్లేని పంచాయతీలు!

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి విడుదల కాని గ్రాంట్లు
- పేరుకుపోతున్న ట్రాక్టర్ల ఇన్‌స్టాల్‌మెంట్ బకాయిలు
- చాలా జీపీల్లో సిబ్బందికి జీతాలివ్వలేని పరిస్థితి
- సర్దుబాటు చేయలేక చేతులెత్తేస్తున్న కార్యదర్శులు

ఓవైపు జీపీల్లో చిల్లిగవ్వ లేదు.. మరోవైపు ప్రభుత్వాలనుంచి గ్రాంట్లు విడుదల కావడం లేదు. దీంతో చాలా పంచాయతీల్లో సిబ్బందికి జీతాలివ్వలేని పరిస్థితి నెలకొంది. ప్రత్యేకాధికారులు పట్టించుకోకపోవడంతో కార్యదర్శులే సొంత డబ్బులతో అత్యవసర పనులు చేయిస్తున్నారు.

సాక్షి, కామారెడ్డి: పంచాయతీలో నిధులు లేక పాలన అస్తవ్యస్తంగా మారింది. డబ్బుల్లేక చాలా గ్రామాల్లో సిబ్బందికి జీతాలు ఇవ్వలేకపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రాంట్లు రాకపోవడం సమస్యగా మారింది. కొన్ని పంచాయతీలకు మాత్రమే ఆదాయం ఉంటుంది. అలాంటి చోట పెద్దగా ఇబ్బంది లేదు. కానీ మిగతా పంచాయతీల పరిస్థితి దయనీయంగా తయారైంది. విద్యుత్ దీపాల నిర్వహణ, బిల్లుల చెల్లింపులు, తాగునీటి పథకాల నిర్వహణ, మోటార్ల మరమ్మతులు.. ఇలా ప్రతీ పనికి డబ్బులు అవసరం. కానీ మెజారిటీ పంచాయతీల్లో డబ్బులు లేకపోవడం సమస్యగా మారింది. దీంతో కార్యదర్శులు అప్పులు చేయాల్సి వస్తోంది.

వర్షాకాలం సీజన్ మొదలైంది. ఎక్కడ చెత్త అక్కడ పేరుకుపోయి వ్యాధులు ప్రబలే పరిస్థితి ఉంది. సానిటేషన్ పనులు చేయడానికి డబ్బులు లేక కార్యదర్శులు పరేషాన్ అవుతున్నారు. జిల్లాలో 526 గ్రామ పంచాయతీలు ఉండగా, దాదాపు 80 శాతం అంటే నాలుగు వందల పైచిలుకు పంచాయతీల్లో చిల్లిగవ్వ కూడా లేదని తెలుస్తోంది. పెద్ద పంచాయతీలు, వ్యాపార కేంద్రాలుగా ఉన్న గ్రామాల్లో ఆదాయ వనరులకు కొంత కొదవలేదు. మిగతా అన్ని పంచాయితీల్లో డబ్బులు లేక ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోతున్నాయి. ఎస్ఎఫ్‌సీ నిధులు ప్రభుత్వం ప్రతీ నెలా సర్దుబాటు చేసేది. అయితే గతేడాది ఫిబ్రవరిలో విడుదల కాగా, ఇప్పటి ఇవరకు నయా పైసా రాలేదు. అలాగే కేంద్ర ప్రభుత్వం ద్వారా అందాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా రావడం లేదు.



ఖజానా ఖాళీ

పంచాయతీల ఖజానా ఎప్పుడో ఖాళీ అయింది. పాలక వర్గాల పదవీకాలం ముగియక ముందే పంచాయతీ పెద్దలు తమకు రావాల్సిన బిల్లులకు సంబందించి ఖజానాలో ఉన్న డబ్బులు ఎప్పుడో ఖాళీ చేశారు. ఇంకా చాలా మంది సర్పంచ్‌లకు చేసిన పనులకు సంబంధించిన బిల్లులు రావలసి ఉంది. సాధారణంగా మార్చి ఆఖరు వరకు పంచాయతీల్లో పన్నుల బకాయలతో పాటు రెగ్యులర్ పన్నులు వసూలు చేస్తారు. అయితే పాలక వర్గాల పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలో ముందుగానే చాలా చోట్ల పన్నులు వసూలు చేశారు. వచ్చిన డబ్బులను పంచాయతీ అవసరాలకు వెచ్చించారు. కొందరు తాము సమకూర్చిన సామగ్రికి బిల్లులు పెట్టి డబ్బులు తీసుకున్నారు. దీంతో పంచాయతీ ఖజానాలు ఖాళీ అయ్యాయి. జీపీలకు ప్రత్యేకాధికారులను నియమించినా వారు చుట్టపు చూపులా వచ్చి వెళ్తున్నారు. బాధ్యత అంతా పంచాయతీ కార్యదర్శులే మోయాల్సి వస్తోంది. విద్యుత్‌దీపాల నిర్వహణ, బోరు మోటార్ల మరమ్మతులు, ఇంకా ఏ అవసరం ఉన్నా కార్యదర్శులు సర్దుబాటు చేస్తున్నారు. అయితే ఎక్కువ మొత్తంలో డబ్బులు అవసరం ఉన్నపుడు వారు కూడా చేతులెత్తేసే పరిస్థితి ఏర్పడింది. పంచాయతీలకు ఇచ్చిన ట్రాక్టర్లు, ట్రాలీలు, ట్యాంకర్ల ఇన్‌స్టాల్‌మెంట్లు చాలా చోట్ల నిధుల సమస్యతో పెండింగులో ఉంటున్నాయి. పెద్దపెద్ద పంచాయతీల్లో సర్దుబాటు చేస్తున్నారు. సగానికిపైగా పంచాయతీల్లో నిధుల సమస్యతో కిస్తీలు చెల్లించడం లేదు.

సిబ్బంది జీతాలకు డబ్బులు లేక..

డబ్బులు నిల్వ ఉన్న కొన్ని పెద్ద పంచాయతీల్లో మాత్రమే సిబ్బందికి నెలనెలా జీతాలు అందుతుండగా, మెజారిటీ పంచాయతీల్లో సిబ్బందికి మూడు, నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. వాటర్‌మెన్, పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు రాకపోవడంతో పని చేయలేమని వారు మొండికేస్తున్నారు. కొందరు కార్యదర్శులు జేబు నుంచి డబ్బులు ఎన్నో కొన్ని సర్దుబాటు చేసి పనిచేయిస్తున్నారు. చిన్న గ్రామాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. కనీసం పాడైన బల్బులు స్థానంలో కొత్తవి పెట్టలేకపోతున్నారు. వర్షాకాలం సీజన్ ఆరంభమైంది. మురికి పేరుకుపోయి రోగాలు ప్రబలుతున్నాయి. డబ్బులు లేకపోవడంతో సానిటేషన్ పనులకు కూడా ఇబ్బందికరంగా మారింది. సిబ్బందితో రోజూ ఒక ప్రాంతంలో పనులు చేయిస్తున్నారు. ప్రభుత్వం గ్రాంట్లు విడుదల చేసి పంచాయతీల కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

పనులను వేగంగా పూర్తి చేయాలి



మాచారెడ్డిలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

మాచారెడ్డి: అమ్మ ఆదర్శ పాఠశాలలో చేపట్టిన పనులను వేగంగా పూర్తిచేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన మాచారెడ్డి ఉన్నత పాఠశాలను సందర్శించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. అనంతరం చుక్కాపూర్ శివారులో వనమహోత్సవంలో భాగంగా అటవీశాఖ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్నారు. సీజనల్ వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట సీసీఎఫ్ శరవరన్, డీఎఫ్‌వో నిఖిత, ఎఫ్ఆర్వో దివ్య, డీఎల్‌పీవో శ్రీనివాస్, ఎంపీడీవో గోపిబాబు, పీఆర్ ఏఈ ఆదిత్య, ఎంపీవో ప్రభాకర్, ఏపీవో సాయిబాబా, ఎంఈవో ఎల్లయ్య, హెచ్‌ఎం వెంకటాచారి తదితరులున్నారు.

జెడ్పీ ప్రత్యేకాధికారిగా కలెక్టర్

కామారెడ్డి క్రైం: జిల్లా పరిషత్ పాలకవర్గాల పదవీ కాలం బుధవారంతో ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారిని నియమించింది. సర్కారు ఉత్తర్వుల మేరకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శుక్రవారం జెడ్పీ ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

నకిలీ మస్టర్లతో వేతనాల చెల్లింపు

నస్రుల్లాబాద్: మండలంలో నాలుగు రోజులుగా జరిగిన ఉపాధి హామీ సోషల్ ఆడిట్‌లో పలు అక్రమాలు వెలుగు చూశాయి. శుక్రవారం ఏపీడీ వామన్‌రావు ఆధ్వర్యంలో ప్రజావేదిక నిర్వహించారు. బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామంలో నకిలీ మస్టర్లు ఉపయోగించి రూ.24,794 వేతనాలు చెల్లించినట్లు గుర్తించారు. ఆ డబ్బులను రికవరీ చేసి, ఫీల్డ్ అసిస్టెంట్ కాశీరాంపై కేసు పెట్టాలని అధికారులను ఏపీడీ ఆదేశించారు. అలాగే సంగం గ్రామంలో ఉపాధి హామీ బోర్డులు నామమాత్రంగా ఏర్పాటు చేశారు. అధికారుల సంతకాలు లేకుండా మండల వ్యాప్తంగా రూ.7.41 లక్షల బిల్లులు చెల్లింపులు జరిగినట్లు సామాజిక తనిఖీలో గుర్తించారు. మైలారంలో ఎఫ్ఏ సుజాత భర్త గంగారాం పని చేయకున్నా 51 రోజులు హాజరు వేసి రూ.10,850 కూలి తీసుకున్నట్లు తేల్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నీలావతి, ఎంపీవో రాము, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



వివరాలను పరిశీలిస్తున్న ఏపీడీ వామన్‌రావు

'అవిశ్వాస ఫలితాన్ని వెల్లడించవచ్చు'

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణపై మే 18న పెట్టిన అవిశ్వాస తీర్మాన ఫలితాన్ని వెల్లడించవచ్చని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసినట్లు మున్సిపల్ వర్గాలు తెలిపాయి. మున్సిపల్ చైర్మన్‌పై ఏప్రిల్ 27న కౌన్సిలర్లు కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానం నోటీసు అందించారు. ఈ మేరకు మే 18న అవిశ్వాస తీర్మాన సమావేశం నిర్వహించారు. అవిశ్వాస తీర్మాన ప్రక్రియ సరిగా లేదని చైర్మన్ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు అవిశ్వాస ఫలితాన్ని ప్రకటించవద్దని స్టే ఇచ్చింది. ఈమేరకు వాదనలను పరిగణలోకి తీసుకున్న హైకోర్టు గతంలో ఇచ్చిన స్టే ఆర్డర్‌ను తొలగిస్తు ఉత్తర్వులు జారీ చేసినట్లు మున్సిపల్ వర్గాలు తెలిపాయి.

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌పై విచారణ



నిజాంసాగర్(జుక్కల్): అచ్చంపేట ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రకళపై వచ్చిన అవినీతి ఆరోపణలపై శుక్రవారం ఎంఈవో దేవిసింగ్ విచారణ చేపట్టారు. పాఠశాలలోని అటల్ ల్యాబ్, ఒకేషనల్ ల్యాబ్, స్కూల్ గ్రాంట్స్ నిధుల్లో తప్పుడు బిల్లులు పెట్టి నిధులు కాజేశారంటూ ఇటీవల ప్రజావాణిలో ఫిర్యాదు నమోదయ్యింది. దీంతో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశాల మేరకు ఎంఈవో విచారణ జరిపారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట నోడల్ అధికారి అమర్‌సింగ్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు భాస్కర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

అధికారులు సమయపాలన పాటించాలి



ఎల్లారెడ్డి: అధికారులు సమయపాలన పాటించాలని ఆర్డీవో మన్నె ప్రభాకర్ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. సిబ్బంది తప్పకుండా సమయపాలన పాటించాలని కార్యాలయంలో ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో గిర్దావార్ శ్రీనివాస్ తదితరులున్నారు.

నేటి నుంచి ధ్రువపత్రాల పరిశీలన

నిజామాబాద్ అర్బన్: ఇంజినీరింగ్‌లో ప్రవేశాలకు సంబంధించి శనివారం నుంచి తొలివిడత ధ్రువపత్రాల పరిశీలన చేపట్టనున్నట్లు కౌన్సెలింగ్ సమన్వయకర్త శ్రీరాంకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13 వరకు పాలిటెక్నిక్ కళాశాలలో ప్రక్రియ కొనసాగుతుందన్నారు. విద్యార్థులు ముందు ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. ఈ నెల 12వరకు స్లాట్‌బుక్ చేసుకొవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు ర్యాంక్ కార్డు, హాల్ టికెట్, పదో తరగతి, ఇంటర్ మెమోలు, బోనఫైడ్‌లు, కుల ధ్రువీకరణ పత్రం, టీసీ, ఆదాయ ధ్రువీకరణపత్రం ఒరిజినల్ పత్రాలతో పాటు ఒక జిరాక్స్ సెట్‌ను తీసుకొని రావాల్సి ఉంటుందన్నారు.

క్లుప్తంగా

'చలో రవీంద్రభారతి' పోస్టర్ల ఆవిష్కరణ

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డితో కలిసి ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షుడు రూసేగం భూమయ్య హలో మాదిగ ఛలో రవీంద్ర భారతి సభ వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు భూమయ్య మాట్లాడుతూ ఈ నెల 7న రవీంద్రభారతి హైదరాబాద్‌లో మాదిగ దండోరా సభ జరుగుతుందన్నారు. ఎమ్మార్పీస్ మండల అధ్యక్షులు సర్వగల్లా రవీందర్, కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.

ఎండీఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కామారెడ్డి టౌన్ : మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ మధ్యాహ్న భోజనం పథకం వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం డీఈవో ఎస్ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చక్రపాణి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 4 నెలల బిల్లులను తక్షణమే చెల్లించాలన్నారు. అల్పాహారం రాగిజావ పెట్టడంతో నష్టపోతున్నామని, కోడిగుడ్లను అంగన్వాడీ సెంటర్ తరహాలో ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు ముస్తఫా, సాయిలు, బాలరాజు, దశరథ్, రియాజుద్దీన్, లక్ష్మణ్ తదితరులున్నారు.

ప్రజా సమస్యలపై పోరాడాలి



దోమకొండ : ప్రజా సమస్యలపై ప్రజాప్రతినిధులు ముందుండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మాజీ జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండలానికి చెందిన వివిధ పార్టీల నాయకులు మాజీ జెడ్పీటీసీలతో పాటు, మాజీ ఎంపీపీ కానుగంటి శారద, ఎంపీటీసీ సభ్యులను సన్మానించగా ఆయన మాట్లాడారు. సీడీసీ మాజీ చైర్మన్ ఐరేని నర్సయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుంచాల శేఖర్, రైతుబంధు మాజీ మండల అధ్యక్షుడు నర్సారెడ్డి, తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంధ్ర మధుసూధన్‌రావ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకర్‌రెడ్డి, రామస్వామిగౌడ్, వివిధ గ్రామాల మాజీ ఎంపీటీసీ సభ్యులు,మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ చైర్మన్



నిజాంసాగర్ (జుక్కల్) : మహమ్మద్ నగర్ మండలంలోని ముగ్దుంపూర్ గ్రామానికి చెందిన చింతకింది రామచందర్ గౌడ్ శుక్రవారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గునుకుల్ సొసైటీ మాజీ చైర్మన్‌గా పనిచేసిన రామచందర్‌గౌడ్ ఆయన కాంగ్రెస్‌లో చేరారు.

పాఠశాలల పరిశీలన

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని మోతె ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ పాఠశాలలను శుక్రవారం మండల ప్రత్యేకాధికారి రాజు, ఎంపీడీవో నరేష్ పరిశీలించారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం తొలగించాలన్నారు.

రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలి

కామారెడ్డి టౌన్ : ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం జాబ్ క్యాలెండర్ అమలు చేయాలని, రెండు లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నంది వేణు మాట్లాడుతూ నిరుద్యోగుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తుందన్నారు. బీఆర్ఎస్ మోసం చేసిందని నిరుద్యోగులు ఉద్యోగాల కోసం కాంగ్రెస్‌ను గెలిపిస్తే అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా నిరుద్యోగులను పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు 2 లక్షల ఉద్యోగాల భర్తీ తో పాటు, గ్రూప్ 1 మెయిన్స్ కి 1: 50 కాకుండా 1:100 నిష్పత్తి అమలు చేయాలన్నారు. 25వేల పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించాలన్నారు. గ్రూప్2, గ్రూప్ 3 పోస్టులను పెంచి మరోసారి నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ గేటు ముందు భారికేడ్లను తొలగిస్తూ లోపలికి వెళ్లడానికి యత్నించగా పోలీసులు నాయకులను అడ్డుకున్నారు. కాసేపు తోపులాట జరిగింది. పోలీసులు సముదాయించడంలో పలువురు నాయకులు లోపలికి వెళ్లి కలెక్టర్ కార్యాలయం ఏవోకు వినతిపత్రం అందజేశారు. బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, నాయకులు శ్రీకాంత్, నరేష్, రాజశేఖర్, నరేష్, రాజేష్, శివ తదితరులున్నారు.



కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులతో ధర్నా చేస్తున్న బీజేవైఎం నాయకులు

బీజేవైఎం నాయకుల ముందస్తు అరెస్ట్

దోమకొండ : బీజేవైఎం నాయకులను పోలీసులు శుక్రవారం ముందస్తుగా అరెస్ట్ చేశారు. నిరుద్యోగులు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేవైఎం నాయకులు రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిచ్చారు. దీంతో వారిని ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు కంది వినోద్‌కుమార్,ప్రధాన కార్యదర్శి సచిన్‌గౌడ్, సీనియర్ నాయకులు రవీందర్‌రెడ్డి తదితరులున్నారు.



దోమకొండ పోలీస్‌స్టేషన్‌లో బీజేవైఎం నాయకులను అరెస్ట్ చేసిన పోలీసులు

విద్యార్థి సంఘం నేత ముందస్తు అరెస్ట్

నిజాంసాగర్(జుక్కల్) : నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శిని శుక్రవారం జుక్కల్ మండల కేంద్రంలో పోలీస్‌లు ముందస్తు అరెస్ట్ చేశారు. నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని, జాబ్ క్యాలెండర్‌ను వెంటనే అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రహదారి విస్తరణ పనులు ప్రారంభం

నిజాంసాగర్(జుక్కల్) : బోధన్- హైదరాబాద్ రహదారి విస్తరణ పనులు జోరందుకున్నాయి. మహమ్మద్ నగర్ మండల కేంద్రం నుంచి బొగ్గుగుడిసె చౌరస్తా వరకు ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను, మట్టిని చదును చేస్తున్నారు. రోడ్డు విస్తరణకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో రహదారిని విస్తరిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా 50 ఫీట్ల చొప్పున రోడ్డును వెడల్పు చేస్తుండటంతో వ్యాపార సముదాయాలను కూల్చి వేతకు చేయాల్సి వస్తోంది. రహదారి విస్తరణ పనులు ప్రారంభం కావడంతో ప్రయాణికులు, వాహన చోదకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న దృశ్యం

బడీడు పిల్లలు బజారులో..

కామారెడ్డి అర్బన్ : బడీడు పిల్లలందరు వీధుల్లో కాకుండా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాల్లో ఉండాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముస్కాన్ లాంటి పథకాలు అమలు చేస్తున్నప్పటికీ కొందరు చిన్నారులు ఇంకా బడిబాట పట్టట్లేదు. కామారెడ్డి భవానీరోడ్డులో శుక్రవారం కొందరు చిన్నారులు చిత్తుకాగితాలు, ఖాళీసీసాలు ఏరుకుంటూ కనిపించారు. బడికి ఎందుకు వెళ్లట్లేదని ప్రశ్నించగా అక్కడి నుంచి పరుగుపెట్టారు. మన బస్తీ–మన బడి కింద పాఠశాలలకు రాని పిల్లలను బడుల్లో చేర్పించారు. కాని ఈ కార్యక్రమంలో పూర్తి స్థాయిలో అమలైన దాఖలాలు కనిపించట్లేదు. కామారెడ్డి పట్టణంలో సీసా కమ్మరులు నివాసం ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పిల్లలను బడుల్లో చేర్పించాల్సిన అవసరం ఉంది.



భవానీరోడ్డులో బాలకార్మికులు

ఉత్సవంలా అంత్యక్రియలు



అంత్యక్రియల్లో పాల్గొన్న నికాల్‌పూర్ ప్రజలు

డొంకేశ్వర్(ఆర్మూర్): అమ్మలా అభిమానించే ఆలయ పురోహితురాలు పరమపదించడంతో ఆమెకు ఘనమైన వీడ్కోలు పలకాలని నిర్ణయించారు ఆ గ్రామస్తులు. అంత్యక్రియలను ఉత్సవంలా నిర్వహించారు. వివరాలిలా ఉన్నాయి. పురానికి హితము చేకూర్చేవారు పురోహితులు.. దీనికి అతికినట్లు సరిపోతారు నిజామాబాద్ జిల్లా డొంకేశ్వర్ మండలం నికాల్‌పూర్ గ్రామానికి చెందిన రుకుంబాయి(84). ఊళ్లోని ముత్యాలమ్మ ఆలయం వద్ద సుమారు యాభై ఏళ్లుగా పూజారిగా పనిచేస్తున్న ఆమె.. అందరి తలలో నాలుకలా మెదిలారు. దీంతో గ్రామంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా రుకుంబాయి వద్దకు వచ్చి చెప్పుకునేవారు. ఆమెతో చెప్పుకుని అమ్మవారికి మొక్కితే సమస్యలు తీరుతాయని విశ్వసించేవారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు సైతం ఆమె అంటే అభిమానం.ఆమె వృద్ధాప్యం తోపాటు ఆరోగ్యం క్షీణించి శుక్రవారం మరణించారు. ఊరందరి అభిమానాన్ని చూరగొన్న ఆమెకు ఘనమైన వీడ్కోలు పలకాలని గ్రామస్తులు నిర్ణయించుకున్నారు. ట్రాక్టర్‌పై సింహాసనం ఏర్పాటు చేసి భౌతిక కాయాన్ని అందులో ఉంచారు. బోనాల పండుగను తలపించేలా అంతిమ యాత్ర నిర్వహించారు. అంత్యక్రియల్లో మహిళలూ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



రుకుంబాయి మృతదేహం

విద్యార్థుల తండ్రిపై టీచర్ దాడి

- స్కూల్‌లో డబ్బుల వసూలుపై ప్రశ్నిస్తే దాడి చేశారని ఆరోపణ
- రాస్తారోకో చేస్తూ నిరసన
- స్టేషన్‌కు తరలించిన పోలీసులు

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని బొమ్మన్‌దేవ్‌పల్లిలో ముగ్గురు విద్యార్థుల తండ్రిపై ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు దాడిచేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. సుందర్ అనే వ్యక్తి శుక్రవారం బొమ్మన్‌దేవ్ పల్లి చౌరస్తాలో నిలబడి ఉండగా ప్రభుత్వ ఉపాధ్యాయుడైన రామకృష్ణ దాడి చేశాడు. సుందర్‌కు చెందిన ముగ్గురు పిల్లల అడ్మిషన్ ఫీజు ఒక్కొక్కరికి రూ. 1,500 చొప్పున కట్టకపోవడంతో అదే స్కూల్‌లో పాఠాలు చెబుతున్న తన భార్య సస్పెన్షన్‌కు గురయ్యే అవకాశాలున్నాయని కోపంతో రామకృష్ణ తనపై దాడి చేశాడని సుందర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. దాడిని నిరసిస్తూ బాధితుడు సుందర్ బొమ్మన్‌దేవ్‌పల్లి కేంద్రంలో ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. దీంతో కానిస్టేబుల్ రమేశ్, మొబిన్‌లు సుందర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు రామకృష్ణతో కూడా ఫిర్యాదు తీసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేస్తామని ఎస్సై లావణ్య తెలిపారు. బొమ్మన్‌దేవ్ పల్లి ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంను వివరణ కోరగా తాము విద్యార్థుల వద్ద నుంచి ఎలాంటి డబ్బులు వసూలు చేయట్లేదని పేర్కొన్నారు.



రోడ్డుపై నిరసన తెలుపుతున్న బాధితుడు

మా సారు మాకే కావాలి..



రాజంపేట: రాజంపేట మండలం శివాయిపల్లి ప్రాథమిక పాఠశాల 2012లో మూతపడింది. ఏడేళ్ల తర్వాత బడి తెరుచుకోగా అధికారులు ఉపాధ్యాయులు ముదాం స్వామి, మరొకరిని డిప్యుటేషన్‌పై నియమించారు. గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. దీంతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 200కు చేరింది. ఇటీవల ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టడంతో ముదాం స్వామి పొందుర్తి ప్రాథమికోన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. తమ గ్రామ పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేసిన స్వామిని అదే బడిలో కేటాయించాలని గ్రామస్తులు కోరతున్నారు. ఈ విషయాన్ని డీఈవో,కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ఉద్యోగుల బదిలీ ఉత్తర్వులపై హర్షం



కామారెడ్డి అర్బన్ : బదిలీల కోసం చిరకాలంగా ఎదురుచూస్తున్న ఉద్యోగులకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 86 జీవో ద్వారా తీపికబురు ఇచ్చినందుకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికి సంతోషంగా ఉందని తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరాల వెంకట్‌రెడ్డి, బొమ్మని సాయిలు అన్నారు. శుక్రవారం సమావేశంలో టీఎన్జీవో నాయకులు మాట్లాడారు. మల్టీజోన్, జోనల్, జిల్లా స్థాయి బదిలీలు పూర్తి పారదర్శకంగా జరిగేలా ఉన్నతాధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని వారు పేర్కొన్నారు.

ఒకరిపై కేసు నమోదు

గాంధారి: అటవీ భూమి విషయంలో కక్షలు పెంచుకుని ఒకరి ఇంటిపై దాడి చేసిన ఘటన మండలంలోని రాంపూర్‌గడ్డ తండాలో శుక్రవారం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. తండాకు చెందిన రాజా, దస్రు కుటుంబాల మధ్య అటవీ భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. పాత కక్షలతో రాజా అనే యువకుడు దస్రు ఇంటిపై దాడి చేసి కిటికీల అద్దాలు, టీవీ ఇతర వస్తువులను ధ్వంసం చేశాడని బాధిత కుటుంబీకులు తెలిపారు. విచారణ చేపట్టి దాడి చేసిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సన్మానం

ఆలయ కమిటీ సభ్యులకు సన్మానం



రాజంపేట : జిల్లా కేంద్రంలోని అయ్యప్ప దేవాలయ నూతన కమిటీ సభ్యులైన అధ్యక్షులు గందె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గోని శ్రీనివాస్, కోశాధికారి సోమిశెట్టి నారాయణ, అన్నప్రసాద దాత సేవా సమితి అధ్యక్షులు విశ్వనాథ్‌ల రాజేందర్, కార్యదర్శి రవికుమార్ కోశాధికారి మోత్కూర్ శ్రీనివాస్‌ను శుక్రవారం రాజంపేట వైస్ చైర్మన్ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాప్రతినిధులకు..



బాన్సువాడ : బీర్కూర్ మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం ప్రజాప్రతినిధులకు ఎంపీడీవో భానుప్రకాష్ ఘనంగా సన్మానించారు. ఎంపీపీ రఘు, వైస్ ఎంపీపీ కాశీరం, జెడ్పీటీసీ స్వరూప, ఎంపీటీసీలు సందీప్‌లతో పాటు మండలానికి చెందిన పలువురు ఎంపీటీసీలను సన్మానించారు. కాంగ్రెస్ నాయకులు బస్వరాజ్, శశికాంత్, అవారి గంగారం, ఆరిఫ్, ఆయా గ్రామాల కార్యదర్శిలు తదితరులు ఉన్నారు.

బ్యాంక్ మేనేజర్‌కు..



భిక్కనూరు : మండలంలోని జంగంపల్లి యునియన్ బ్యాంక్ మేనేజర్‌గా కే రాము శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను ఖాతాదారులు సత్కరించారు. ఈ సందర్భంగా మేనేజర్ రాము మాట్లాడుతూ రైతులు, ప్రజలు ఏదేని రుణాలు అవసరం ఉంటే తనను నేరుగా సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, బాబు, నర్సింలు పాల్గొన్నారు.

విద్యార్థినికి..



బాన్సువాడ : ట్రిపుల్‌ఐటీకి ఎంపికైన విద్యార్థినిని శుక్రవారం ఎంఈవో నాగేశ్వర్‌రావు ఘనంగా సన్మానించారు. తిర్మలాపూర్ క్యాంప్(కొత్తాబాది) ఉన్నత పాఠశాల పాఠశాలలో పదో తరగతి చదివిన మీనాజ్ తహరిన్ ట్రిపుల్‌ఐటీకి ఎంపికయ్యారు. దీంతో విద్యార్థినికి ఎంఈవో సన్మానించారు. హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు హన్మాండ్లు, రాజేశ్వర్, విఠల్‌రెడ్డి, ఆనంద్, ప్రవీణ్, శంకర్, పుష్పలత తదితరులు ఉన్నారు.

సమృద్ధిగా వర్షాలు కురవాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : సమృద్ధిగా వర్షాలు కురవాలని గిరిజనులు భవానీమాతకు ప్రత్యేక పూజలు చేసి వేడుకుంటున్నారు. శుక్రవారం మండలంలోని బేగంపూర్ తండాలో గిరిజన ప్రజలు పసుక పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భవానీ సేవాలాల్ మహరాజ్‌కు శిర నైవేద్యం భోగ్ బండార్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కిరాణ వర్తక సంఘం అధ్యక్షుడిగా సత్యం



ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి కిరాణ వర్తక సంఘం అధ్యక్షుడిగా పూసల సత్యంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సభ్యులు శుక్రవారం తెలిపారు. ఉపాధ్యక్షుడిగా సయ్యద్‌మీర్ అష్ఫు, ప్రధాన కార్యదర్శిగా రవి, కోశాధికారిగా మహేశ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

జీజీహెచ్‌లో రోగి అదృశ్యం

- విలపిస్తున్న కుటుంబీకులు
- పట్టించుకోని అధికారులు

నిజామాబాద్‌నాగారం: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ అదృశ్యమైంది. ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. డిచ్‌పల్లి మండల కేంద్రానికి చెందిన రఫికబేగం అనారోగ్యానికి గురి కావడంతో ఈ నెల 2న జీజీహెచ్‌కు వచ్చారు. అనంతరం వైద్యుల సూచన మేరకు ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యారు. నాలుగు రోజులుగా ఆమెకు చికిత్స అందుతోంది. శుక్రవారం ఉదయం రఫికబేగం ఆస్పత్రి నుంచి అదృశ్యమైంది. ఈ విషయాన్ని గమనించిన కుటుంబీకులు జీజీహెచ్ వైద్యులు, నర్సింగ్, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కానీ వారు స్పందించకపోవడంతో డయల్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా ఒకటోటౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. రఫికబేగం అదృశ్యంతో కుటుంబీకుల బోరున విలపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



అదృశ్యమైన రఫికబేగం

పేదల సేవే పరమావధి



నిజాంసాగర్(జుక్కల్): పేద ప్రజల సేవ పరమావధిగా, సమాజసేవకు పాటు పడుతున్నామని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సతీమణి అర్చన అన్నారు. శుక్రవారం జుక్కల్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఆవరణలో ఆశ్రయం హ్యాండ్ ఆఫ్‌హోప్ మెడికల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఎమ్మెల్యే పుట్టిన రోజును పురస్కరించుకొని వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయడం తో 8 మండలాల నుంచి 1,800 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, వారికి కావాల్సిన మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్యురాలు శిరీష, వాసవి, భరత్, సుదీర్, వాణి తదితరులున్నారు.

క్రైం కార్నర్

రెండు బైక్‌లు ఢీ: ఒకరి మృతి

మోర్తాడ్: రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై మశ్చేందర్‌రెడ్డి శుక్రవారం పేర్కొన్నారు. వివరాలిలా ఉన్నాయి. ఏర్గట్ల పీఎస్ పరిధిలోని తాళ్లరాంపూర్ నుంచి దోంచంద వెళ్లే మార్గంలో రెండు బైక్‌లు ఢీకొనగా దోంచందకు చెందిన శాంసన్(27) గురువారం రాత్రి మృతి చెందాడు. ఒక బైక్‌పై ఉన్న అనిల్‌కు తీవ్రగాయాలు కాగా మరో వాహనంపై ఉన్న శ్రవణ్, అశోక్, నిఖిల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సీతారాంనగర్ కాలనీలో చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని సీతారాంనగర్ కాలనీలో ఉన్న ఓ ఇంట్లో దుండగులు గురువారం రాత్రి చోరీకి పాల్పడినట్లు ఎస్సై అశోక్ శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. కాలనీకి చెందిన వెంకటేశ్వర్లు కుటుంబీకులతో కలిసి 10 రోజుల క్రితం అమెరికాలో ఉన్న కుమార్తె వద్దకు వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గమనించిన దుండగులు రాత్రి వేళ పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. బీరువాను ధ్వంసం చేయగా నగదు లభించక పోవడంతో వెళ్లిపోయినట్లు పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చోరీ కేసులో నిందితుడికి 7 నెలల జైలు

ఎల్లారెడ్డి: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో చోరీకి పాల్పడిన నిందితుడికి ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి హారిక ఏడు నెలల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై మహేశ్ శుక్రవారం తెలిపారు. పట్టణానికి చెందిన గుజ్జరి నాగరాజు గతేడాది సెప్టెంబర్ 30న అయ్యప్ప ఆలయంలో చోరీకి పాల్పడడంతో అతడిపై కేసు నమోదైంది.విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితుడికి ఏడు నెలల జైలు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.నాగరాజును జిల్లా జైలుకు తరలించినట్లు ఎస్సై వెల్లడించారు.

ఒకరిపై కేసు నమోదు

వర్ని: మండల కేంద్రంలోని కల్లు దుకాణంలో బాల కార్మికుడితో పనిచేయిస్తున్న యజమాని రాజేశ్‌గౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణకుమార్ పేర్కొన్నారు. అసిస్టెంట్ చైల్డ్ లేబర్ ఆఫీసర్ నరేందర్ రాజు ఫిర్యాదు మేరకు కల్లు దుకాణ యజమానిపై కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా చిన్నపిల్లలతో పనులు చేయిస్తే వారిపై శాఖపరమైన చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తామని రాజు వెల్లడించారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం



గాంధారి: మండలంలోని కరక్‌వాడిలో శుక్రవారం ఓ ఇంట్లో ఉంచిన 15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు శుక్రవారం పేర్కొన్నారు. మండల కేంద్రానికి చెందిన ఒడుసుల సంతోష్, పత్తి నవీన్ కరక్‌వాడిలో పీడీఎస్ బియ్యం సేకరించి అదే గ్రామానికి చెందిన చిట్టి ప్యాకల సాయిలు ఇంట్లో అక్రమంగా దాచి ఉంచారు. విషయం తెలుసుకున్న పోలీసులు సాయిలు ఇంట్లో సోదా చేయగా 15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో సేకరించిన బియ్యాన్ని మండల కేంద్రానికి చెందిన కందుకూరి వెంకటేశం అనే వ్యాపారికి విక్రయిస్తున్నట్లు చెప్పారు. సాయిలు, సంతోష్, నవీన్, వెంకటేశంపై కేసు నమోదు చేసి బియ్యాన్ని పౌరసరఫరాల అధికారులకు అప్పగించినట్లు ఎస్సైపేర్కొన్నారు.

కందర్‌పల్లిలో..

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని కందర్‌పల్లి రోడ్డులో గురువారం రాత్రి పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కందర్‌పల్లి రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోలో తరలిస్తున్న 4క్వింటాళ్ల50 కిలోల బియ్యం పట్టుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రికవరీ ఫోన్ల అప్పగింత

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పీఎస్ పరిధిలో ఫోన్లు పోగొట్టుకున్న 15 మంది బాధితులకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్లను ట్రాక్ చేసి బాధితులకు అప్పగించినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు శుక్రవారం పేర్కొన్నారు. ప్రజలు రైల్వేస్టేషన్, బస్టాండ్, మార్కెట్, రద్దీ ప్రాంతాల్లో తమ వస్తువులు, ఫోన్లను జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు.

కడుపునొప్పితో ఆర్టీసీ కండక్టర్ ఆత్మహత్య



శ్రీనివాస్(ఫైల్)

ఖలీల్‌వాడి: కిడ్నీ సమస్యతో పాటు విపరీతమైన కడుపునొప్పితో బాధపడుతున్న కండక్టర్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన నాందేవ్‌వాడలో శుక్రవారం చోటు చేసుకుంది. మూడో టౌన్ ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మాక్లూర్ మండలం కల్లూర్ గ్రామానికి చెందిన ఈరవత్రి శ్రీనివాస్(28) ఆర్టీసీ కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శ్రీనివాస్‌కు కిడ్నీలో రాళ్లు రావడంతో కొన్ని రోజులుగా బాధపడుతున్నాడు. దీంతో కల్లూర్‌కు వస్తూ విధులు నిర్వహించడం ఇబ్బందిగా మారింది. జిల్లా కేంద్రంలోని నాందేవ్‌వాడలో రూమ్ అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. గురువారం అర్ధరాత్రి కిడ్నీలతో కడుపునొప్పి విపరీతంగా రావడంతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం విషయం గమనించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

జీవితంపై విరక్తి చెంది..

బాల్కొండ: జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని చిట్టాపూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై యాసర్ అర్ఫాత్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాడ రాజేశ్వర్(68) కొంత కాలంగా తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలో అధికంగా మద్యం సేవిస్తుండడంతో అనారోగ్యానికి గురయ్యాడు. వారం రోజులుగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి శ్రీరాంపూర్ శివారులో ఉన్న తన వ్యవసాయ క్షేత్రంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య రాడ గంగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్షణికావేశంలో చెరువులో దూకి..

పిట్లం: ఇంట్లో జరిగిన గొడవకు ఓ మహిళ క్షణికావేశంలో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మారేడ్‌చెరువులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన అంజవ్వ (38)కు ఇంట్లో కుటుంబీకులతో గొడవ జరిగింది. దీంతో క్షణికావేశంలో మారేడ్‌చెరువులో పడి దూకింది. గమనించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం అందించారు. వారు జాలర్ల సాయంతో అంజవ్వ మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతిరాలి తల్లి బాలవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.



అంజవ్వ మృతదేహం